## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 17-04-2011, ముమ్మిడివరం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ ముమ్మిడివరం గ్రామం చాలా ప్రాచీనమైన గ్రామం. ఇక్కడ ఉన్న శివాలయం కూడా చాలా ప్రాచీనమైన దేవాలయం, ఇది సూర్యభగవానుడిచేత స్థాపించబడినది. ప్రజాసేవ అందరూ చేయలేరు, అది చాలా కష్టంతో కూడినది. గాడ్ హేజ్ క్రియేటెడ్ సమ్ సోల్స్ టు లివ్ ఫర్ అదర్స్ ఓన్లీ అని వేదంలో చెప్పాడు. కొంతమంది వారిపొట్టకోసం, వారి కుటుంబం కోసమే జీవిస్తారు, ఇంక దేని గురించి ఆలోచించరు. కాని కొంతమంది ఎలా ఉంటారు అంటే వారి కుటుంబంకోసం ఎలా కష్టపడుతున్నారో అలాగ సమాజ శ్రేయస్సు కోసం కూడా కష్టపడి పని చేస్తారు, అలా పనిచేసే వారు కొద్దిమంది మాత్రమే ఉంటారు. లౌకికమైన ప్రయోజనం ఆశించకుండా పని పని కోసమే చేస్తూ ఉంటే, సమాజరూపంలో ఉన్న భగవంతుడిని ఆరాధిస్తూ ఉంటే వారికి వ్యక్తిభావన తగ్గిపోతుంది, దేహభావన తగ్గిపోతుంది, లోకవాసన తగ్గిపోతుంది. సత్కర్మ స్వార్థరహితంగా చేస్తూ ఉంటే వారికి ఆత్మవిజయం చేకూరుతుంది. ఆత్మవిజయం అంటే మనలను మనం జయించుకోవటం. ఆత్మవిజయం కలిగితే వారికి ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం పెర్ఫెక్టుగా ఉంటుంది అంటే వారి మనస్సు, ఇంద్రియాలు వారికి పూర్తిగా స్వాధీనంలో ఉంటాయి. ఆత్మవిజయం కలుగకుండా ఎవరికీ ఆత్మజ్ఞానం కలుగదు. మనం శరీరాన్ని ఆత్మ అనుకొంటున్నాము. లోకాన్ని ఆత్మ అనుకొంటున్నాము. దేహం పట్ల ఆత్మబుద్ధి ఉన్నవాడికి, లోకం పట్ల ఆత్మబుద్ధి ఉన్నవాడికి ఆత్మజ్ఞానం కలుగదు. ఎవడైతే ఆత్మవిజయాన్ని సాధించి ఉన్న వస్తువును ఉన్నట్లుగా గ్రహించాడో, ఎవడైతే సత్యస్వరూపమైన బ్రహ్మాన్ని అనుభవంలోనికి తెచ్చుకున్నాడో వాడు మాత్రమే ఈ జీవకోటిని జననమరణ చక్రం నుండి విడుదల చేయగలడు, మిగతావారికి సాధ్యంకాదు.

జీవుడు వేరు, ఆత్మవేరు అనేది వ్యవహారంలో ఉంది గాని స్వరూపంలో ద్వితీయం లేదు. వ్యవహారదృష్టిని దాటి స్వరూపదృష్టి కలిగేవరకూ ప్రతీ మనిషికి దుఃఖం తప్పదు, అశాంతి తప్పదు, సంసారం తప్పదు. మనోనాశనం అవ్వాలంటే జపధ్యానములకంటే వివేకం ముఖ్యం. ఏది సత్యము, ఏది అసత్యము, ఏది మనకు ఉపయోగపడుతుంది, ఏది మనకు ఉపయోగ పడదు, ఏది నిషిద్ధకర్మ, ఏది కర్తవ్యకర్మ అని విభజించుకునే శక్తి మన బుద్ధికి అవసరం. స్వార్థం ఉన్న వాడికి పరమార్థం అందదు. మనకు స్వరూపజ్ఞానం కలుగకుండా ఎవరో

అడ్డువస్తున్నారు అని అనుకొంటున్నాము కాని మన స్వార్థమే మనకు అడ్డు వస్తోంది. నిష్కామకర్మ చేసే వాడికి, దేహభ్రాంతి లేకుండా పనిచేసేవాడికి, లోకవాసన లేకుండా పని చేసేవాడికి స్వార్థం తగ్గుతూ ఉంటుంది. దేహాత్మబుద్ధి లేనివాడికి, మమకారం లేనివాడికి దుఃఖం ఎక్కడ ఉంది. మనలో ఉన్న అజ్ఞానమే, మనలో ఉన్న వ్యక్తిభావనే మన దుఃఖానికి కారణం కాని బాహ్యపరిస్థితులుకాదు. జపధ్యానములు అవసరమే కాని నీకు దేహాత్మబుద్ధి ఉన్నంతకాలం ఎంతసేపు జపం చేసినా, ఎంతసేపు ధ్యానం చేసినా దుఃఖం నశించదు. వాడు మంచివాడు, వీడు చెడ్డవాడు అని ఎవరి గురించి తీర్పులు చెప్పవద్దు. మీరు ఒకడిని చెడ్డవాడు అంటే వాడిని మంచివాడు అనే వారు ఇంకా చాలామంది ఉంటారు. మీరు ఒకడిని మంచివాడు అంటే వాడిని చెడ్డవాడు అనే వారు ఇంకా చాలామంది ఉంటారు. ఇవన్నీ మనోకల్పితములు, వీటి గురించి ఆలోచించి మీరు కాలాన్ని పాడుచేసుకోవద్దు.

సుఖం, శాంతి, ఆనందం అనేది మన హృదయంలో తప్పించి బయట ఈ సృష్టిలో ఎక్కడా లేదు. స్వరూపజ్ఞానం కలిగినవాడికి లోకం ఎక్కడ ఉంది, వాడికి లోకం లేదు అంటే వాడు లోకాన్ని చూడడు అని కాదు లోకం తన స్వరూపానికి భిన్నంగా కనబడదు. మనకు లోకం వేరుగా కనిపిస్తోంది అందుచేత లోకాన్ని చూస్తే మనకు భయం వేస్తోంది. స్వరూపజ్ఞానం కలిగినవాడికి నేనువేరు, లోకం వేరు అనే భేదబుద్ధి ఉండదు. మనలో భేదబుద్ధి ఉన్నంత కాలం భయం తప్పదు, కోరిక తప్పదు. భయం ఉంటే నష్టం ఏమిటి? కోరిక ఉంటే నష్టం ఏమిటి? అని మీరు అడగవచ్చు. ఎక్కడ భయం ఉంటే, ఎక్కడ కోరిక ఉంటే అక్కడ దుఃఖం వచ్చేస్తుంది. అందుచేత నువ్వు కోరికలు ఏమీ పెట్టుకోవద్దు. దేహప్రారబ్ధంలో ఉన్నది వస్తుంది, లేనిది రాదు. అందుచేత ప్రారబ్ధాన్ని ఇష్టంగా అనుభవించు, సహనంగా అనుభవించు. అప్పుడు ఇంక ఇటువంటి ప్రారబ్ధం రాబోయే జన్మలో రాదు. ప్రారబ్ధాన్ని ఆందోళనగా అనుభవించకు, సహనంగా అనుభవించు అని చెపుతూ ఉంటే దీనికి భగవాన్ ఏమన్నారు అంటే ప్రారబ్ధం ఎవరికి శరీరానికే కదా. శరీరం - అది ఒక నంబర్‌వన్ అబద్ధం, దానికి ప్రారబ్ధం అని ఇంకో అబద్ధాన్ని కల్పించారు అని చెప్పారు. ఈ ప్రారబ్ధం నిజం అని అనుకొంటున్నావు కాబట్టి నువ్వు ఆందోళన చెందుతున్నావు. ఈ దేహం ఎంత అబద్ధమో, ఆ ప్రారబ్ధం కూడా అంతే అబద్ధం అని నీకు అనుభవంలోనికి వచ్చినప్పుడు ఆందోళనతో పని ఏముంది? దుఃఖంతో పని ఏముంది? నువ్వు ముళ్ళకంపల మధ్యన ఉన్నా శాంతిగానే ఉంటావు. ఇక్కడ భగవాన్ చెప్పేది ఏమిటి అంటే శాంతి అనేది, సుఖం అనేది నీ హృదయం లోనే ఉంది. లోకంలో ఎక్కడా శాంతి లేదు.

సుఖంలేదు. నువ్వు చేసే మొదటి తప్పు ఏమిటి అంటే సుఖంకోసం, శాంతికోసం లోకంలో వెతుకుచున్నావు. అంటే ఎక్కడైతే సుఖంలేదో, శాంతిలేదో అక్కడ వాటికోసం వెతుకుచున్నావు. ఉన్నచోట వెతకటం మానేసావు. అంటే బాహ్యముఖంగా తిరుగుచున్న నీ మనస్సును అంతర్ముఖం చేస్తే ఇంక నీకు అశాంతి లేదు, దుఃఖం లేదు.

మీ ఇంట్లో ఎవరికైనా అనారోగ్యం వస్తే మీకు దుఃఖం వచ్చేస్తుంది. మీ ఇంటి ప్రక్కన ఉన్నవారికి ఎవరికైనా అనారోగ్యం వస్తే మీకు దుఃఖంరాదు ఎందుచేత? ఈ శరీరం నాది అనుకోవటం వలన, ఈ శరీరంతో అనుబంధం ఉన్నవారు నీ వాళ్ళు అనుకోవటం వలన ఆ మమకారంలోనుండే దుఃఖం వస్తోంది. సంసారానికి, పునర్జన్మలకు కూడా ఈ మమకారమే కారణం. ఆచార్యులవారు ఏమన్నారు అంటే ఎవరూ నావారు కాదు, నేను ఎవ్వరివాడిని కాదు అని నీకు అర్థమైతే ఇంక నీకు దుఃఖం ఏమిటి? అన్నారు. నువ్వు కాని దానిని నువ్వే అనుకొంటున్నావు దానికి అవిద్య కారణం. అవిద్య నశించే వరకు మమకారం నశించదు, దుఃఖం నశించదు. అవిద్యను నాశనం చేసుకోవటానికి నువ్వు ప్రయత్నం చేయాలి, భగవంతుడి పట్ల భక్తి కలిగి ఉండాలి, గురువు పట్ల భక్తి కలిగి ఉండాలి. నీ ప్రయత్నానికి వారు సహకారం అందిస్తే కాని అవిద్య నశించదు. అవిద్య ఎప్పుడైతే నశించిందో నువ్వు కానిదానిని నువ్వే అనుకొనే బుద్ధిపోతుంది, అప్పుడు ఎటుచూసినా శాంతే, ఎటు చూసినా సుఖమే. సత్యాన్వేషణ మీదే మీ బుద్ధిని పెట్టండి. చేసే ప్రయత్నం చిత్తశుద్ధితో చెయ్యండి, కపటం పనికిరాదు. రామకృష్ణ పరమహంసగారికి అంత ఖ్యాతి రావటానికి కారణం ఆయన మాటలోగాని, చేతలోకాని ఎక్కడా కపటం లేదు. మీరు సాధన చేస్తున్నారు కాని ఎందుకు సక్సెస్ అవ్వటం లేదు అంటే మీరు చేసే ప్రయత్నంలో చిత్తశుద్ధి లేదు, హృదయ పూర్వకంగా మనం ప్రయత్నం చేయటం లేదు. కొంతమంది సమాజాన్ని చూసి, లోకాన్ని చూసి భయపడుతూ ఉంటారు. ఎవడైతే లోకాన్ని భయపెట్టడో, లోకాన్ని చూసి ఎవడైతే భయపడడో అట్టి భక్తుడు అంటే నాకు బాగా ఇష్టం అని పరమాత్మ చెప్పాడు. మీరు చేసే పని వలన మీకు ఆనందం రావాలి. మీరు విసుగ్గా పని చేస్తారు అనుకోండి. ఏదో మనకు ఈ ప్రారబ్ధం వచ్చింది అని అలా చేస్తారు అనుకోండి దానివలన మీకు ఆనందం రాదు. మీరు కర్తృత్వం లేకుడా పనిచెయ్యాలి. భగవంతుడు మనకు ఈ అవకాశం ఇచ్చాడు కాబట్టి చేస్తున్నావు అనే భావనతో చెయ్యాలి, భగవంతుడు అవకాశం ఇవ్వకపోతే ఆపని మీరు ఎలా చెయ్యగలరు. ఆయన అవకాశం ఇచ్చాడు కాబట్టి చేస్తున్నారు. ప్రపంచంలో ఉన్న ఐశ్వర్యం అంతా ఈశ్వరుడిదే. ఈశ్వరుడు మన ప్రారబ్ధానికి

ఎంతైతే కేటాయించాడో అంతే ఐశ్వర్యం వస్తుంది కాని అంతకంటే ఎక్కువరాదు. ఆశపడటం వలన ఎక్కువ వచ్చేయదు, ఆశ లేకపోవటం వలన తక్కువ రాదు. ఇదంతా అసత్యమే. దేహమే సత్యం కానప్పడు ప్రారబ్ధం సత్యం ఎలా అవుతుంది?

మీరు చెవులతో ఎంతసేపు లోకం గొడవలు వినటం తప్ప ఇంకో పని లేదు. లోకానికి సంబంధించిన విషయాలు చెపితే మీరు ఆనందంగా వింటున్నారు కాని ఆత్మజ్ఞానం గురించి చెపుతూ ఉంటే మీకు ఆనందం కలగటంలేదు. మీ చెవులను లోకానికి అమ్ముకోవటం ఎందుకు అంటున్నారు భగవాన్. లోకానికి సంబంధించిన ఏ వార్త విన్నా అందులో దోషం ఉందని మీకు తెలియటం లేదు. నిరంతరం లోకవిషయాలు వినటం వలన మీ మనస్సు పొల్యూట్ అయిపోతుంది. వ్యక్తిభావనలోనే దుఃఖం ఉంది, వ్యక్తిభావన లేనివాడికి దుఃఖం లేదు, ఏ సమస్యలు లేవు. హద్దులు లేని, పరిమితులు లేని ఆత్మగా ఉన్న మిమ్మల్ని ఒక దేహానికో, మనస్సుకో మిమ్మల్ని కట్టేసుకుంటే వ్యక్తిభావన కలుగుతుంది. వ్యక్తిభావన అనేది నిజంకాదు, అదికూడా కల్పితం, కొంచెం విచారణ చేస్తే అది పోతుంది. మీరు జపం చెయ్యండి, ధ్యానం చెయ్యండి కాని అన్నింటికంటే ముందు సబ్జక్టును ప్రోపర్‌గా అర్థంచేసుకోండి. మా అత్తగారు మంచిది కాదు, మామగారు మంచివారు కాదు, వారివలన దుఃఖం వస్తోంది అని చాలామంది అంటారు. అసలు మీ లోపల ఉండి ఎవడైతే దుఃఖపడుతున్నాడో, వాడు ఎవడు అని విచారణ చేస్తే ఈ బయటి కారణాలతో సంబంధంలేకుండా మీకు దుఃఖం ఆగిపోతుంది. మీరు దుఃఖంలేని స్థితికి, ఆనందస్థితికి ఎదిగివచ్చినప్పడు బయట కారణాల వలన దుఃఖం వస్తున్నప్పటికి ఆ దుఃఖస్పర్శ మిమ్మల్ని అంటదు, వారు ఏదో మిమ్మల్ని కష్టపెట్టేస్తున్నారు అనే తలంపు కూడా మీకు రాదు.

ఇప్పడు మీకు బయట కారణాలు అన్నీ బాగున్నాయి అనుకోండి, వాటివలన మీకు సంతోషం వస్తోంది అనుకోండి. ఆ సంతోషం ఎంతకాలం ఉంటుంది. మీరు ఎంతకాలం ఉంటారు. మీ కుటుంబపరిస్థితులు అన్నీ బాగున్నాయి అని ఈ శరీరాలు వెయ్యి ఏళ్ళు ఉంటాయా? మీకు బాగా డబ్బు ఉంది అనుకోండి. ఆ డబ్బు ఉండగా ఈ శరీరం పోవచ్చు లేకపోతే ఈ శరీరం ఉండగా డబ్బు పోవచ్చు. ఇవి ఏమీ నిజంకాదు. మీరు మందబుద్ధులు కాబట్టి ఇది అంతా నిజంకింద మీకు కనిపిస్తోంది. నువ్వు బయట గొడవలలోనికి వెళ్ళవద్దు. నువ్వు ఏదిగా ఉన్నావో అదిగా ఉండటానికి ప్రయత్నం చెయ్యి. నీకు మరొక పేరే సుఖం, నీకు మరొక పేరే ఆనందం, నీకు మరొక పేరే శాంతి, దానిని అందుకోవటం మానేసి ఎందుకువయ్యా

రోడ్డు మీద ఉన్న పెంకుముక్కలకోసం తిరుగుతావు. దానిని అందుకోవటానికి ప్రయత్నం చెయ్యి, చిల్లర గొడవలు వద్దు. నీ ప్రారబ్దం మంచిగా ఉన్నా, చెడ్డగా ఉన్నా అది నీవు కానప్పుడు దాని గోల నీకు ఎందుకు? అంటారు భగవాన్. అది మంచి ప్రారబ్ధం అవ్వవచ్చు, చెడు ప్రారబ్ధం అవ్వవచ్చు, ప్రారబ్ధం దేహానికే కదా. ఆ దేహం నీవుకాదని నీకు తెలిసినప్పుడు ఆ ప్రారబ్ధం గొడవ నీకు ఏమిటి? అది మంచి అయినా ఏమీ లేదు, చెడ్డ అయినా ఏమీ లేదు, అంతా స్వప్న సమానం. మనకు ఒకోసారి మంచి స్వప్నాలు వస్తాయి. ఒకోసారి చెడ్డస్వప్నాలు వస్తాయి, మెలకువరాగానే అదీ అబద్ధమే, ఇదీ అబద్ధమే. నీ జీవితంలో జరిగిన సంఘటనలు అన్నీ కూడా అవి నీకు అనుకూలంగా ఉన్నా ప్రతికూలంగా ఉన్నా వాస్తవంలో అవి అన్నీ అబద్ధాలే. ఆ అబద్ధాలను చూసి నీకు దుఃఖమేల, భయమేల, అశాంతి ఏల అంటున్నారు.

నువ్వు అన్నమాట ఎవరైనా కాదంటే, లేకపోతే వారు అన్నమాట నువ్వు కాదంటే, ఎందుకు అలా కాదంటున్నారో దానికి సంబంధించిన అవగాహన మీకు పెరిగితే ఆ సమస్య పరిష్కారం అవుతుంది. అవగాహన చాలా ముఖ్యం. అవగాహన పెరుగుతూ ఉంటే చాలా సమస్యలు పరిష్కారమవుతాయి. అయితే మనమందరం తలకాయలేని మనుషులుగా తయారవుతున్నాము. మీరు జపధ్యానములు తరువాత చేద్దురుగాని కంగారుపడకండి ముందు మీ తలకాయను ఉపయోగించుకోండి అంటే అవగాహన పెంచుకోమని చెప్పటం. మీకు ఏదైనా సమస్య వస్తే దానిని ఫేస్ చెయ్యండి అంతేగాని పారిపోవద్దు. ఈ జన్మలో కాకపోయినా రాబోయే జన్మలో అయినా ఆ సమస్యను పరిష్కారం చేసుకోవాలి. అజ్ఞానం అనేది అనేక జన్మల నుండి వస్తోంది. అది మీ సొంత సమస్య. దానిని మీరే పరిష్కారం చేసుకోవాలి గాని ఎవరో వచ్చి పరిష్కారం చేస్తారని ఎదురుచూడవద్దు. ఒక వెయ్యి సంవత్సరాల నుండి ఒక గదిలో చీకటి ఉంది అనుకోండి. ఆ గదిలో మీరు దీపం వెలిగించారు అనుకోండి. నేను వెయ్యి సంవత్సరాలనుండి ఇక్కడ ఉన్నాను, నేను ఎక్కడికి పోతాను అని చీకటి అనదు, దీపం వెలిగించిన వెంటనే చీకటి పోతుంది, వెలుతురు వచ్చేస్తుంది. అలాగే కొన్ని వేల జన్మల నుండి మీలో అజ్ఞానం ఉండవచ్చు కాని గురువు అనుగ్రహం వలన, దైవానుగ్రహం వలన మీరు ఆత్మజ్ఞానాన్ని సంపాదిస్తే అజ్ఞానం వెంటనే నశిస్తుంది, మీరు ఆనందప్రవాహంలో, శాంతిప్రవాహంలో ఈదులాడతారు.

సమస్యలు అన్నీ మనస్సు రూపంలో ఉన్నాయి. మనస్సు అణిగిపోతే సమస్యలు అంటూ ఏమీలేవు. సమస్యలను పరిష్కారం చేసుకోవాలి అనుకొన్నప్పుడు మీరు కలిసి కూర్చొని

మాట్లాడుకోండి. ఒక అవగాహనకు రావాలి, అసలు మీరు చెప్పేది ఎదుటి వారికి అర్థమవ్వాలి కదా. ఈ మధ్యన ఒక ఆవిడ అంటున్నారు, నువ్వు గుడికి వెళ్లకు, మీటింగులకు వెళ్లకు అని మా ఆయన అంటున్నారు. ఆయన నన్ను ఏమైనా డబ్బుపెట్టి కొన్నారా అని అడుగుతోంది. ఆయనకు ఇష్టంలేకపోతే గుడికి వెళ్లటం మానేయవచ్చు. నన్ను వెళ్లవద్దు అని చెప్పటం ఏమిటి? ఆయన నన్ను పెళ్లిచేసుకొన్నాడు, ఆ పెళ్లి పర్పస్ ఏదో నెరవేరుతోంది కదా. డబ్బు పెట్టి బజార్లో జంతువును కొన్నట్లుగా నన్ను ఆయన కొన్నాడా? నన్ను ఏమైనా జంతువు అనుకుంటున్నాడా? పైగా నేనే కట్నం ఇచ్చాను కాని ఆయన నాకు ఏమీ డబ్బు ఇవ్వలేదు. పోనీ నేను చెప్పినట్లు ఆయన ఏమైనా చేస్తాడా? లేదు. ఆయనకు మైండ్ ఎలా ఉంటుందో నాకు మైండ్ ఉంటుంది కదా. అంటే దీని అర్థం ఏమిటి అంటే మనిషికి ఎంతో కొంత ఫ్రీడమ్ ఉండాలి. ఎంతో కొంత ఫ్రీడమ్ లేకపోతే మనిషి బతకలేడు, వాడికి మెంటల్ వచ్చేస్తుంది. పోనీ ఆయన చెప్పినట్లే గుడికి వెళ్లను, మీటింగులకు వెళ్లను. ఇద్దరం ఇంట్లోనే కూర్చుని ఆయన వంక నేను, నావంక ఆయన అలా ఎంతసేపు చూసుకొంటాము అంటోంది. కొంతమంది వారు గుడికి వెళ్లకపోయినా ఇంట్లోవారిని అభ్యంతరం పెట్టరు, మీకు వెళ్ళాలి అంటే వెళ్లిరండి అని చెపుతారు.

నీ హృదయంలో ఒక నిజం ఉంది, అది నీకు తెలియకపోవటం వలన నిజం కాని విషయాలు అన్నీ నీకు నిజంకింద కనిపిస్తున్నాయి. ఈ ప్రపంచం మంచిదీ కాదు, చెడ్డదీ కాదు, ఊరికే అలా ఉంది అంతే. ఒక చెట్టు ఉంది. ఆ చెట్టుకింద కొంతమంది కూర్చుంటారు. ఆ చెట్టుకింద కూర్చొని నీడను పొందినా, ఆ చెట్టుకు వేలాడి చనిపోయినా ఆ చెట్టుకు సంబంధం లేదు. ఈ ప్రపంచం కూడా చెట్టులాంటిదే. ఈ ప్రపంచం మంచిదీకాదు, చెడ్డదీకాదు, అది ఎలాగ ఉండాలో అలాగ ఉంది. నువ్వు లేనిపోని గొడవలు అన్నీ ప్రపంచం మీద ఆరోపించుకొంటున్నావు. మాయ అంతా నీ మనస్సులో ఉంది. ప్రపంచం మంచిది అనుకొన్నా నీ మనస్సే. అది చెడ్డది అనుకొన్నా నీ మనస్సే. అది రెండూ కాదు. చెడ్డపనులూ భగవంతుడే చేయిస్తున్నాడు, మంచి పనులూ భగవంతుడే చేయిస్తున్నాడు అనుకొన్నప్పుడు మనిషికి దుఃఖం ఎందుకు వస్తోంది అని ప్రశ్న. మంచిపని చేసినా, చెడ్డపని చేసినా ప్రేరణ భగవంతుడి దగ్గరనుండే వస్తోంది అనుకో. ఆ మంచిపనికి, చెడ్డపనికి కూడా నేను కర్తను కాదు అని నీకు అనుభవంలోనికి వచ్చినప్పుడు ఇంక నీకు దుఃఖమేల. మొత్తం మీద అంతా ముండనం చేసి వదిలిపెడుతున్నాడు. నువ్వు కర్తవుకాదు అని నీకు అనుభవంలోనికి వచ్చినప్పుడు పొంగిపోవటంలేదు, కుంగిపోవటంలేదు, జన్మలేదు, పునర్జన్మలేదు. అంతా భగవంతుడే

చేయిస్తున్నాడు అని నోటితో అంటున్నావు కాని ఆ చెడ్డ పనులకు, మంచిపనులకు నేను కర్తను అని లోపల అనుకొంటున్నావు. అందుచేత నీకు దుఃఖం వస్తోంది. నువ్వు నోటితో చెప్పిన వాక్యంమీద నీకు నమ్మకం ఉంటే, అది నీకు అనుభవంలో ఉంటే నీకు దుఃఖం రానేరాదు. అంటే వాడు చెప్పిన అబద్ధాన్ని వాడి మొఖంమీద పెట్టి కొట్టటం. మీకు ఏ కారణం వలన దుఃఖం వచ్చినా అది సత్యం కాదు, అది అసత్యమే. గాఢనిద్రలో ఎవరికీ దుఃఖం ఉండదు. అసలు ఏ కారణం వలన దుఃఖం వచ్చినా అది కల్పితమే.

దుఃఖంకూడా ఒక తలంపేనా అని భగవాన్‌ను అడిగితే దుఃఖంకూడా ఒక తలంపు అనికాదు, అన్ని తలంపులూ దుఃఖమే అని చెప్పారు. మీకు ఏ తలంపు వచ్చినా మీరు స్వరూపాన్ని విడిచిపెట్టి బయటకు వచ్చేస్తున్నారు. అందుచేత ఏ తలంపు వచ్చినా అది దుఃఖానికే దారి తీస్తుంది. నీకు నిద్రలో నుండి మెలకువ రాగానే నేను అనే తలంపు వస్తుంది. అది తలంపే, అది నిజం కాదు. ఆ నేను అనే తలంపు రాగానే ఆ తలంపు దేహంతో తాదాత్మ్యం పొందుతుంది. అక్కడ నుండి దుఃఖం ప్రారంభమవుతుంది. దేహము నేను అనే తలంపు ఎంత నిజమో నీకు వచ్చే దుఃఖం కూడా అంతే నిజం. నిన్ను నమ్మమని భగవాన్ చెప్పటం లేదు, ఆలోచించమని చెపుతున్నారు. దేవుడు ఉన్నాడని నమ్మమని భగవాన్ ఎప్పుడూ చెప్పరు. నీకు దేవుడు ఉన్నాడని నమ్మకం ఉంటే నీ మనస్సును వాడికి ఇచ్చేయి, దేవుడు మీద నమ్మకం లేదు అంటావా నీ మనస్సును బోనులో ఎక్కించి విచారణ చెయ్యి. నువ్వు విచారణ చేసినా అది పోతుంది, భగవంతుడికి శరణాగతి చేసినా అది పోతుంది. నువ్వు భక్తిమార్గంలో ప్రయాణం చేసినా, విచారణా మార్గంలో ప్రయాణం చేసినా ఈ నేను అనే తలంపులోనుండి విడుదల పొందాలి. దేహము నేను అనే బుద్ధిలోనుండి నువ్వు విడుదలపొందకపోతే నువ్వు కోటి జన్మలు ఎత్తినా దుఃఖం నిన్ను విడిచిపెట్టదు. దుఃఖం ఎక్కడ ఉంది? నీ మనస్సులో ఉంది. అందుచేత నీ మనస్సు అణిగిపోతే దుఃఖం అణిగిపోతుంది. ఇప్పుడు నువ్వు ఏదైతే నేను నేను అంటున్నావో దాని చుట్టూ తిరుగుతున్నావు. అది దొంగ నేను. దాని వెనకాల ఒక నిజమైన నేను ఉందని నీకు తెలియటం లేదు. ఎందుచేతనంటే నువ్వు పూర్వజన్మలలో సత్కర్మ చెయ్యలేదు, కనీసం మనస్సులో అయినా ఇతరుల సుఖాన్ని కోరుకోవటంలేదు, ఒక విచారణ లేదు, గురువు అనుగ్రహం లేదు, సమాజం దేవుడిని ఎప్పుడూ ఆరాధించటం లేదు, ఇంక నీకు నిజమైన నేను గురించి ఎలా తెలుస్తుంది.

మీరు ఇష్టాలు, అయిష్టాలు తగ్గించుకోండి. వీటివలన ప్రమాదం ఏమిటి అంటే ఇష్టాలు,

అయిష్టాలు వలన నీ మనస్సు బాహ్యముఖానికి వచ్చేస్తుంది. ఉద్రేకం తగ్గించుకోండి. ఉద్రేకం పెరిగేకొలది ఆలోచన తగ్గిపోతుంది. సమస్యను ఉన్నది ఉన్నట్లుగా ఆలోచించలేము. సమస్య వచ్చినప్పుడు ఎవరైనా ఉద్రేకంగా మాట్లాడుతున్నారు అనుకోండి, మీరు ఉద్రేకపడుతున్నారు అనకుండా రెండు రోజులు ఉన్నాక మాట్లాడుకొందాము నాకు తొందరపని ఉంది, ఈ రోజుకు వాయిదా వేద్దాము అంటే సరిపోతుంది. మీకు తొందరపని లేకపోయినా అలా చెప్పాలి. అటువంటి అబద్ధాలవలన మీకు పాపం వచ్చేయదు. ఎందుచేతనంటే మీకు దుర్బుద్ధి ఉండి ఆ మాట చెప్పటంలేదు, మీ హృదయంలో దోషం లేదు, సమస్య పరిష్కారం కోసం అలా చెపుతున్నారు. అది బాహ్యంగా చూస్తే అబద్ధమే కాని మీ హృదయంలో దోషం లేదు కాబట్టి దాని వలన పాపం మీకు అంటదు. నేను పుట్టినప్పటి నుండి కష్టాలే, అన్నీ బాధలే. నేను పూర్వజన్మలో ఏమైనా దోషాలు చేసానా, ఆ దోషమే ఇప్పుడు దుఃఖరూపంలో వచ్చిందా అని అడుగుతున్నారు. పూర్వ జన్మలో దోషాలు చేసి ఉంటే నువ్వు చెప్పే పూర్వజన్మ ముందు ఇంకో జన్మ ఉండాలి కదా ఇలా ఎన్ని జన్మలు వెనక్కి వెళతావు, అలా వెళితే నీకు సరియైన సమాధానం రాదు. నీకు నిజంగా ఎన్ని జన్మలు వచ్చినా ఆ జన్మలన్నింటికి నీలోపల ఉన్న అవిద్య కారణం. అవిద్య ఇప్పుడు కూడా నీకు ఉంది. పూర్వజన్మలో ఏదో చేసాను, ఇప్పుడు అనుభవిస్తున్నాను అని చెప్పేది ఆత్మకాదు, నీలో ఉన్న అవిద్యే చెపుతోంది. అవిద్య ఎలా పోతుంది అంటే ఆత్మవిద్య కలిగితే అవిద్య నశిస్తుంది. అందుచేత అవిద్యను నాశనం చేసుకోవటానికి ప్రయత్నం చేయాలి కాని ఏదో జన్మ వచ్చింది, అప్పుడు ఏదో దోషం చేసాను, ఆ దోషం దుఃఖరూపంలో వస్తోంది అని ఇలా అనుకొంటూ ఉంటే ఇంక దానికి ముగింపు ఉండదు. ముందు అవిద్యను తొలగించుకోవటానికి ప్రయత్నం చెయ్యి. దానికోసం సజ్జన సాంగత్యం చెయ్యి, సద్గ్రంథ పఠనం చెయ్యి.

జరగవలసినది ఏదో జరుగుతుంది. మీరు దేనిగురించి వర్రీ పడవద్దు. మీరు ఎంతవరకు ప్రయత్నం చేయగలిగితే అంతవరకు చెయ్యండి. జరిగిపోయిన గొడవల గురించి ఆలోచించవద్దు, బాధపడవద్దు. మిమ్మల్ని ఎవరైనా పొగుడుతూ ఉంటారు, ఎవరైనా విమర్శిస్తూ ఉంటారు. ఈ రెండూ అబద్ధాలే అన్నారు భగవాన్. ఆ మాటలలో దోషం ఉంది. ఎందుకు ఆ మాటలు వింటున్నారు, ఆ రెండూ కూడా మీ మనస్సును పొల్యూట్ చేస్తాయి. ఆ మాటలలో దోషం ఉందని మీకు తెలియకపోవటం వలన మీ చెవులను మార్కెట్‌కు అమ్ముకొంటున్నారు. పూర్వం గొడవ వదిలెయ్యండి ఇప్పుడు దుఃఖం లేకుండా ఉండాలి అంటే నేను ఎలా ఉండాలి అని అడుగుతున్నారు. నువ్వు ముందు కళంకం లేకుండా

చూసుకో, మాటలోగాని, చేతలోగాని కపటం లేకుండా చూసుకో, త్రికరణశుద్ధిగా పనిచెయ్యి. అప్పుడు నీ మనస్సు అనే బట్ట చిరిగిపోతే లోపలఉన్న ఆనందం నీకు గోచరిస్తుంది, అది నీకు అనుభవంలోనికి వస్తుంది. మన హృదయంలో నుండి సహస్రారానికి ఒక నాడి ఉంటుంది, దానిని అమృతనాడి అంటారు. సర్వసాధారణంగా అందరిలోను అది మూసుకొని ఉంటుంది. దైవానుగ్రహం వలన, గురువు అనుగ్రహం వలన, మీ పుణ్యం పండటం వలన అది ఓపెన్ అయ్యింది అనుకోండి లోపలఉన్న సుఖసముద్రం వచ్చి మీ సహస్రారాన్ని ముంచేస్తుంది. అది నువ్వు తట్టుకోలేవు కాబట్టి నీకు ఇవ్వటానికి భగవంతుడు ఆలస్యం చేస్తున్నాడు. ఇంకా నువ్వు దానికి డిజర్వ్ అవ్వలేదు అందుకే ఆయన లేట్ చేస్తున్నాడు. అలాగని మీమీద భగవంతుడికి దయ లేదని అనుకోవద్దు.

నా శరీరం బాధ పడుతోంది, నా మనస్సు దుఃఖపడుతోంది అంటున్నావు. ఆయన ఒక్కసారి అమృతనాడిని ఓపెన్ చేసాడు అనుకో అయ్యబాబో ఆనందం భరించలేకపోతున్నాను అని చచ్చివూరుకుంటావు. ఇప్పుడు దుఃఖం భరించలేకపోతున్నావు, అప్పుడు ఆనందం భరించలేవు. టైము వస్తుంది కంగారు పడకు. ఇప్పుడు నీ శరీరం దుఃఖం అనుభవించవచ్చు, ఇది ఎప్పుడూ ఉండదు. నువ్వు గతంలోనికి వెళ్ళకు. అవిద్యను రెడ్యూస్ చేసుకోవటానికి ప్రయత్నం చెయ్యి. అప్పుడు సుఖం, శాంతి నీకు అందుతాయి. నేను దుఃఖపడిపోతున్నాను అని ఇప్పుడు నువ్వు ఎలా చెపుతున్నావో మరల నాదగ్గరకు వచ్చి శాంతిని, సుఖాన్ని భరించలేకపోతున్నాను సర్ఫెలెస్ అయిపోతోంది అని నువ్వు చెప్పే రోజులు వస్తాయి. జ్ఞానికి ఈ లోకంలో బాధలు కనిపిస్తాయా అని అడిగితే భగవాన్ ఏమంటున్నారు అంటే జ్ఞాని దృష్టిలో లోకమే లేదు, ఇంక లోకంలో బాధలు కనిపించటం ఏమిటి అంటున్నారు. మనకు ఎప్పుడైనా కల వస్తుంది కదా, ఆ కలలో మనకి దుఃఖం వస్తుంది. జ్ఞానికి లోకం కనిపిస్తున్నప్పటికీ, లోకంలో దుఃఖం కనిపిస్తున్నప్పటికీ కల ఎంత నిజమో, కలలో వచ్చిన దుఃఖం ఎంత నిజమో ఇది కూడా అంతే నిజం అని వాడికి అనిపిస్తుంది, వాడు జ్ఞాని. శరీరం ఒక అబద్ధం, ప్రారబ్దం ఒక అబద్ధం. ఈ అబద్ధాన్ని తీసుకొనివచ్చి ఆ అబద్ధానికి కట్టేస్తున్నారు. ఎంత గొడవ, ఎంత అల్లరి అంటున్నారు భగవాన్. మీరు ఇక్కడపడి ఉంటున్నారు. మీ హృదయం వైపుకు ఎప్పుడు కళ్ళు తెరుస్తారు. మీరు నిద్రలో నుండి జాగ్రదవస్థలోనికి వచ్చేస్తున్నారు. అలాగే ఈ జాగ్రదవస్థలో నుండి హృదయంలో ఉన్న నిజంలోనికి మేల్కోవాలి. అప్పటివరకు నీ ప్రయాణం ఆపుచేయవద్దు. నువ్వు నిద్రలో నుండి జాగ్రదవస్థలోనికి మేల్కోవటం కాదు అజ్ఞానంలో నుండి జ్ఞానంలోనికి మేల్కోవాలి.

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

- Mahabharatha

# నిజమైన శ్రీరమణాశ్రమం

శ్రీ రమణాశ్రమం అంటే మనకు సుమారు 800 కి.మీ. దూరంలో తమిళనాడులో ఉన్న ఇటుకలు, సిమ్మెంటుతో నిర్మింపబడిన భవన సముదాయం అనుకొంటాం, కాని అది నిజం కాదు. మన దుఃఖానికి, అశాంతికి కారణం బయటి వస్తువులు, సంఘటనలు అని భ్రమపడి దుఃఖకారణాన్ని బాహ్యంలో వెతుకుతాం. కాని నిజమైన దుఃఖకారణం దేహాత్మ బుద్ధియే! ఈ దేహాత్మబుద్ధిని అతిక్రమించాలంటే "నేనెవరు?" అనే విచారణ ఆవశ్యకం. "నేనెవరు?" అనే విచారణా యుక్తమైన మనస్సే నిజమైన శ్రీరమణాశ్రమం.

**- చావలి సూర్యనారాయణ మూర్తి, టీచర్,**
**అమలాపురం**

# అహంకార పరిత్యాగం

మిథ్యా స్వరూపమైన అహంకారాన్ని త్యాగం చేస్తే, మనము సచ్చిదానంద స్వరూపులమే అవుతాం. కాని అహంకార పరిత్యాగం అంత సులభం కాదు, దానికి కారణం అనేక జన్మల నుండి అదే 'నేను' అనుకొని తాదాత్మ్యం చెందుతున్నాం. సమాజంకన్నా, పరిస్థితుల ప్రభావం కన్నా, ప్రారబ్ధం కన్నా, మన మనస్సే మనలను ఎక్కువ దుఃఖానికి, అశాంతికి గురిచేస్తుంది. దుఃఖ కారణాన్ని బాహ్యంలో వెదుకుతాం, కాని నిజమైన కారణం దేహాత్మబుద్ధియే! సకల అరిష్టాలకు, జన్మ పరంపరకు దేహాత్మబుద్ధే కారణం. ద్వంద్వాలను సమబుద్ధితో స్వీకరిస్తే మనస్సు శాంతమవుతుంది. ఇప్పుడే, ఇక్కడే, ఈ క్షణంలోనే 'నేను' అంటే బ్రహ్మమే! ఆ ఎరుకకు ఆటంకంగా నిలిచేది దేహాత్మబుద్ధియే! అజ్ఞాన జనితమైన అట్టి దేహాత్మబుద్ధి నుండి విడుదల పొందాలంటే కపటం లేకుండా జీవిస్తూ, అవగాహనతో గురుబోధను శ్రద్ధగా శ్రవణం చేస్తూ, మననము, నిధి ధ్యాసల ద్వారా స్వరూప అమృతస్థితిలోకి మేల్కొనాలి. పరమాత్మ మనకు ఏఏ అవకాశాలను ఎంతవరకు ఇచ్చాడో అంత వరకు వాటిని సద్వినియోగం చేసుకోవాలి. లేని వాటి గురించి చింతించకూడదు. లక్ష్యసాధన పైనే మనస్సును గురిపెట్టాలి.

**- చావలి సూర్యనారాయణ మూర్తి, టీచర్,**
**అమలాపురం**

# వాదం అజ్ఞానాన్ని ప్రదర్శిస్తుంది - విచారణ విజ్ఞానాన్ని అన్వేషిస్తుంది

విద్యావంతులైన వారిలో చాలామంది అసందర్భమైన విషయాలలో చిక్కుకుంటారు. భగవంతుణ్ణి బుద్ధితో తెలుసుకోవటం సాధ్యమనుకొంటారు. దానికి సంబంధించిన రుజువులు కోరుకొంటారు. గీత అంతా కంఠస్తం చేసినా, ఉపనిషత్తులు అన్నీ భాష్యంతో చెప్పినా, బ్రహ్మసూత్రాల సమన్వయం చేసినా అది అంతా పాయసంలో గరిటిలాంటిది. గరిటికి పాయసం అనుభూతి ఎలా తెలుస్తుంది. అంతరంగమైన సత్యానుభవం లేశమైనా లేనప్పుడు ఇది అంతా అజ్ఞానం యొక్క అజ్ఞానం. అనేక ముఖాలుగా ప్రసరించే మనస్సు సత్యాన్ని గ్రహించలేదు. కొందరు పండితులు మిగతావారిని అవివేకులుగాను, మూఢులుగాను జమకడతారు. రామకృష్ణులు "పసి పిల్లలవంటి స్వభావం గలవారే పరమాత్మను చేరుకొంటారు" అన్నారు. మేధాశక్తికి పాండిత్యానికి తావు ఎక్కడ. మానవుడు తన అజ్ఞానాన్ని, చాతుర్యాన్ని విడనాడాలి వారు తర్కానికి దిగుతారు, వాద వివాదాల్లో దిగుతారు వారికి అడుగడుగునా ఆటంకాలే. ప్రభువు అదృశ్యుడు, అగోచరుడు అని అనుకొనేవానికి ఏమీ లభించదు. ప్రభువు గోచరుడు అని ఘంటాపదంగా చెప్పి ఆచరించినవారు చాలా మంది ఉన్నారు. శోధించి ప్రయత్నం చెయ్యకపోతే తప్పు ఎవరిది? రోగాన్ని పోగొట్టుకోవాలంటే రోగి మందు వాడాలి, పత్యం చెయ్యాలి. వేరొకరు మందు వాడితే పోదు. అలాగే ఆత్మానుభవానికి స్వయంకృషి, గురు కటాక్షం కావాలి. అనంతమైన పరబ్రహ్మ జ్యోతి అభిముఖమైనప్పుడే నిజమైన విద్య ప్రారంభమౌతుంది. విజ్ఞాన వాహిని వెల్లువిరుస్తాయి" అన్నారు. అంతేగాని గ్రంధాల్లోని విషయాలను ఆ ఎంగిలి ముక్కలతో ఎవరినీ ప్రభావితం చెయ్యలేరు. విద్యావంతులు భగవంతుని ఇంట కాపలాదార్లు వారు స్వయంగా లోపలికి వెళ్లలేరు ఏ భక్తుడైనా వెళ్ళానంటే నమ్మరు. అస్పష్టత సత్యానికి అడ్డుకట్ట. వాదాలు విభజిస్తాయి. విభజనకు సులభోపాయం వాదం. ప్లేటో "పాఠశాలలు, కళాశాలల్లో బోధించేది విద్యకాదు అసలు విద్యకు అది ఒక సాధనం మాత్రమే. తన్ను తాను జయించిన వానికి కవిత్వ కవాటాలు తెరుచుకుంటాయి" అన్నారు. నా కవిత్వం నా ప్రసంగం బాగుండాలని ఆనందించేవాడికి సామర్థ్య స్థితిలో ఉండలేడు లేదా వ్రాస్తున్నాను అనే దేహ స్తుతి ఉన్నంతకాలం వ్రాయలేడు. వేద రహస్యాలు గ్రహించనివారు కన్నులుండి గ్రహించలేరు. రమ్యమైన వస్త్రం ధరించిన భార్య తన భర్తకు మాత్రమే తన శరీరాన్ని చూపుతుంది. అలాగే వేద సత్యం విశ్వసించి, ఆకాక్షించి కోరే భక్తాగ్రేసరులకే గోచరిస్తుంది. పూర్ణభక్తికి పూర్ణజానానికి తేడా లేదు.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్థవరం**